
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు




టపాసులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్న వినియోగదారులు

రాష్ట్రాభివృద్ధికి వెన్నుదన్నుగా నిలవాలి

● ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



పులివెందుల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు వెన్నుదన్నుగా నిలవాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పులివెందులలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల డిమాండ్లను తీర్చేందుకు సిద్ధంగా ఉందని, సీఎం చంద్రబాబు అందరికీ తగిన న్యాయం చేస్తారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గమనించి అందరూ ముందుకు సాగాలన్నారు. త్వరలోనే పీఆర్సీకి సంబంధించి సంతోషకరమైన వార్త వింటారని, నవంబరు 1న ఒక డీఏ కూడా అందివ్వనున్నారని తెలిపారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో నాలుగు డీఏల బకాయిలు పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. అలాగే ఎన్నో ఏళ్లుగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లకు త్వరలో ఉత్తర్వులు జారీ కానున్నాయని తెలిపారు.


మున్సిపల్ గ్రౌండులో విద్యుత్‌కాంతుల మధ్య దుకాణాలు





దీపావళి సంబరం

● జోరందుకున్న బాణసంచా దుకాణాలు



కడపకల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పండుగల్లో కెల్లా దీపావళి పండుగ ప్రత్యేకమైనది. చిన్న, పెద్ద తేడా లేకుండా సంతోషకర వాతావరణంలో జిల్లా వ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటారు. చిచ్చుబుడ్లు, టపాసులు, కాకరొత్తులు తదితరవి పోటీపడి మరీ కాలుస్తారు. సోమవారం దీపావళి సందర్భంగా జిల్లా ప్రజలు ఆనందకరంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, కమలాపురం తదితర నియోజకవర్గాల్లో టపాసుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కడప నగరంలోని మున్సిపల్ స్టేడియం వద్ద టపాసుల కేంద్రాలు భారీగా వెలిశాయి. డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లతో దుకాణదారులు ప్రజలను ఆకట్టుకుంటున్నారు. వీటితో పాటు వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

రద్దీగా నగరం

నగరంలోని వైవీ స్ట్రీట్, బీకేఎం స్ట్రీట్, మద్రాసు రోడ్డు, వై.జంక్షన్, అంబేడ్కర్ సర్కిల్, రాజీవ్‌మార్గ్, ఎర్రముక్కపల్లె సర్కిల్, ఐటీఐ, సంధ్యా సర్కిల్, క్రిష్ణ సర్కిల్, గోకుల్‌సర్కిల్ తదితర ప్రధాన కూడళ్లలో వివిధ వస్తువులు, దుస్తులు తదితర వాటి కొనుగోళ్లతో కిటకిటలాడాయి. ఆ కోవలో బాణసంచా అమ్మకాల దుకాణాల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడడంతో రద్దీగా మారింది.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం : అదనపు ఎస్పీ


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

కడపక్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసాంఘిక శక్తుల చేతుల్లో మృతి చెందిన పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు అన్నారు. అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ ఆదివారం సమావేశమయ్యారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలు, కుటుంబ స్థితిగతులు, బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, డీపీవో ఏవో వెంకటరమణ, సూపరింటెండెంట్ సురేశ్, ఆర్ఐలు శివరాముడు, శ్రీశైలరెడ్డి, టైటస్, సోమశేఖర్‌నాయక్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలి

కడప కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి పండుగను కన్నుల పండువగా జరుపుకోవాలని, టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు.

సంతానలక్ష్మికి పూజలు

గుర్రంకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, పుష్పాలతో ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు. సంతానం లేని దంపతులు ఆలయంలో వరపడ్డారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

● దిగువకు 10,896 క్యూసెక్కులు ● రాకపోకలకు అంతరాయం


గేట్ల ద్వారా విడుదల చేసిన నీరు

సుండుపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు నుంచి ఆదివారం ఉదయం నీటిని విడుదల చేసినట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ తెలిపారు. ప్రాజెక్టు పైప్రాంతంలో శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో పీలేరు, తలకోన అటవీ ప్రాంతం నుంచి 11,118 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతుండడంతో మూడు గేట్ల ద్వారా నదిలోకి 10,896 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. నీటిని నదిలోకి విడుదల చేయడంతో చిన్నబిడికి దిగువ భాగంలో పింఛా నదిపై నిర్మించిన లోలెవెల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 20 పల్లెలకు బస్సు సౌకర్యం లేకుండాపోయింది. నదీ పరివాహక ప్రాంతంలోకి ప్రజలు ఎవరూ వెళ్లకూడదని ప్రాజెక్టు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

● హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్

కడప మారుతీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. జిల్లా పౌర సమాజం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాత రిమ్స్‌లో గల బీసీ భవన్‌లో దాడికి నిరసనగా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గవాయ్‌పై జరిగిన దాడి కేవలం శారీరక దాడి కాదని, ఇది భారత రాజ్యాంగం మూలస్తంభాలపై ప్రధానంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమానత్వం, స్వేచ్ఛ సౌభ్రాతృత్వం అనే ఆదర్శాలపై జరిగిన భావజాల దాడి అన్నారు. సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించమని హెచ్చరిక చేయడం దేనికి సంకేతమో అర్థం చేసుకోవాలన్నారు. కేంద్రంలో పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వ కుట్రలను ప్రజలందరూ అర్థం చేసుకొని రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు వెంకటశివ, రామ్మోహన్, ఎల్ఐసీ నాయకులు రఘునాథ రెడ్డి, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కేవీ రమణ, ఎస్టీయూ నాయకులు సురేశ్‌బాబు, ఆర్ఎస్ఎఫ్ నాయకులు ఓబులేసు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్‌తో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కడపక్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు చేశామని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాగా జిల్లా ప్రజలకు, పోలీసులకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పటాకుల అంగళ్లు తనిఖీ

కడప క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రాకర్స్ షాపులు యజమానులు పోలీసుశాఖ నిబంధనలు తప్పక పాటించి విక్రయాలు చేయాలని అలా ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రాకర్స్ గోడౌన్, షాపులను ఆదివారం తనిఖీలు నిర్వహించి భద్రతా ప్రమాణాలు పరిశీలించారు. ప్రతి షాపులో అగ్నిమాపక పరికరాలు తప్పక ఉండాలన్నారు. భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. దీపావళి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసు అధికారులు ప్రజలకు సూచించారు.



షాపులను పరిశీలిస్తున్న కడప తాలుకా సీఐ రెడ్డప్ప

వల్లూరు...: దీపావళి సందర్భంగా ఆదివారం వల్లూరు మండలంలోని గణేశ్‌పురం గ్రామంలో ఏర్పాటు చేసిన టపాసుల అంగళ్లను పోలీసు సిబ్బందితో కలిసి ఎస్ఐ పెద్ద ఓబన్న ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన స్టాళ్లలోనే ప్రజలు కొనుగోలు చేయాలన్నారు. అనధికారికంగా ఎవరైనా స్టాళ్లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దల పర్యవేక్షణలో పిల్లలు బాణసంచా కాల్చి దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

కడపలో బుడ్డా వెంగల్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కడపలో మహాదాత బుడ్డా వెంగల్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కుమ్మరి దస్తగిరి రచించిన బుడ్డావెంగల్‌రెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ కార్యక్రమం ఆదివారం నగర హౌసింగ్ బోర్డు కాలనీ కోదండ రామాలయంలో జరిగింది. రాయలసీమ టూరిజం అండ్‌కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక పరిచయ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమర్‌నాథరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి,



మాట్లాడుతున్న అమర్‌నాథరెడ్డి

రెడ్డిసేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, ఆ ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి, నగర డిప్యూటీ మేయరు నిత్యానందరెడ్డి, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు కె.చిన్నపరెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం..సాక్ష్యం..!

పచ్చని(పిచ్చి)మొక్కల మధ్య డీ-బ్లాక్

అక్కడంతా పచ్చదనం పరుచుకుని ఎంతో ఆహ్లాదంగా ఉందనుకుంటే తప్పులే కాలేసినట్లే. సరిగ్గా చూస్తే అవన్నీ పిచ్చిమొక్కలు. ఇదెక్కడో మారుమూల ప్రాంతాల్లోని శిథిలభవనాల మధ్య అనుకునేరు. కాదండోయ్... జిల్లా కేంద్రంలో ఉన్న కలెక్టరేట్‌లోని భవనాల్లోనివి. ఇక్కడ ఉన్నవన్నీ అధిపతుల కార్యాలయాలే. చూడగానే ముచ్చటేసేలా ఉండాల్సిన ఉద్యానవనాల స్థానంలో కలెక్టరేట్‌లోని డీ-బ్లాక్ ప్రాంతం అంతా పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు వ్యాప్తి చెంది ఉన్నాయి. దీంతో కలెక్టరు కార్యాలయ భవనాల మీదుగా అల్లుకుని ఉన్న పిచ్చి తీగల ద్వారా విష పురుగులు కార్యాలయాల గదుల్లోకి చేరే అవకాశాలు లేకపోలేదు. కాగా పిచ్చిమొక్కలే కాదు.. తుప్పుబట్టిన వాహనాలు కూడా బారులు తీరి దర్శనమిస్తున్నాయి.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



డీ-బ్లాక్ కార్యాలయ భవనం మీదికి పాకిన తీగలు





డీ-బ్లాక్ కింద భాగంలో ముళ్ల పొదలతో నిండిఉన్న దృశ్యం

దీపావళి పండుగను జాగ్రత్తగా నిర్వహించుకోవాలి

కడప సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఎ.వెంకటేశ్వర్లు



కడప క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, జాగ్రత్తగా నిర్వహించుకోవాలని కడప సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఎ.వెంకటేశ్వర్లు సూచించారు. ఆ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా దీపావళి రోజు పిల్లలు టపాసులు పెద్దల పర్యవేక్షణలోనే కాల్చాలన్నారు. ఇళ్లలో, రోడ్ల మధ్యలో లేదా వాహనాల సమీపంలో టపాసులు కాల్చరాదన్నారు. చేతిలో పట్టుకుని కాల్చరాదన్నారు. సింథటిక్ బట్టలు కాకుండా పత్తి లేదా తెల్లని వస్త్రాలు ధరించడం మంచిదన్నారు. దీపాల, కొవ్వొత్తులకు దగ్గరగా ఉండరాదన్నారు. టపాసులు కాల్చిన తరువాత వాటి అవశేషాలు వెంటనే తాకకుండా అవి పూర్తిగా ఆరిపోయిన తరువాతనే పారవేయాలన్నారు. టపాసులు కాల్చేచోట బకెట్‌తో నీరు ఉంచుకోవాలన్నారు.వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు ఉండే సమీపాల్లో కాల్చరాదన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు 112కు ఫోను చేయాలన్నారు. అలాగే దీపావళి పండుగకు ఊరికి వెళ్లాలనుకుంటే తలుపులకు బలమైన తాళాలు వేసి వెళ్లాలన్నారు. విలువైన వస్తువులు ఇంట్లో ఉంచరాదన్నారు. నగదు, నగలు, ఇతర విలువైన పత్రాలను లాకర్లలో ఉంచడం ఉత్తమమన్నారు. ముఖ్యంగా ఇళ్లకు సీసీకెమెరాలు అమర్చుకోవాలన్నారు. అలాగే ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇల్లు వదలి వెళ్లే ముందు దగ్గరలోని పోలీసుస్టేషన్‌లో విషయం తెలిపి ఎల్‌హెచ్‌ఎంఎస్ కోసం నమోదు చేసుకోవాలన్నారు. పోలీసులు వివిధ సమయాల్లో ఇంటిని పర్యవేక్షిస్తారన్నారు. మీరు ప్రయాణం చేస్తున్న సంగతిని సోషల్ మీడియాలో ఫొటోలను, వీడియోలను షేర్ చేయవద్దన్నారు. ఇది దొంగలకు సంకేతంగా మారుతుందన్నారు. రాత్రివేళ ఇంటి ముందు భాగం గ్యారేజీ, ఆవరణాలన్నీ వెలుగుతో నిండేలా చూసుకోవాలన్నారు.

చెన్నూరులో దీపావళి సందడి

చెన్నూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు ఒక రోజు ముందే చెన్నూరులోసందడి నెలకొంది. కొత్తరోడ్డులో టపాకాయల అంగళ్లు ఏర్పాటు చేయడంతో ఆదివారమే వాటిని కొనుగోలు చేసేందుకు పిల్లలు, పెద్దలు ఎగబడ్డారు. రాత్రి 8గంటలకు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వీటితో పాటు ప్రమిదలు, లక్ష్మీదేవి బొమ్మలు కూడా మహిళలు కొనుగోలు చేశారు.

తరతరాలుగా బీసీలకు అన్యాయం

కడప మారుతీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని జేసీఐపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లయ్య, జయరాం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

కడప మారుతీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వడ్డెరల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి సన్నద్ధం కావాలని వడ్డెర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు బాలకొండయ్య, జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వడ్డెరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర సామాజిక వర్గాన్ని పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు , వడ్డెర కులస్థులు పాల్గొన్నారు.

డీఏ ప్రకటన హర్షణీయం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం దీపావళి కానుకగా ఒక డీఏను ప్రకటించడంతో ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఇంటర్మీడియట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి.మల్లికార్జునరాజు హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజుల ముందే దీపావళి పండుగ వచ్చినట్టు ఉందన్నారు. ఆదివారం కడప నగరం ఏపీఎన్జీఓ హోంలో థ్యాంక్యూ సీఎం సార్ ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో నవంబరు 1 నుంచి డీఏ అమలు చేస్తామని, హెల్త్ స్కీం సేవలను మెరుగుపరుస్తామని, పీఆర్సీ, పాత పింఛన్ విధానంపై చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా విన్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

అంధకారాన్ని తొలగించేదే దీపావళి

కడప కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవితంలో అంధకారాన్ని తొలగించేదే దీపావళి అని ఆంధ్ర, కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌చార్జ్ సీనియర్ రాజయోగిని బ్రహ్మకుమారి గీతా దీదీ అన్నారు. దీపావళి పర్వదిన సందర్భంగా నగర ఓం శాంతినగర్‌లో గల సేవాకేంద్రం, ఓం నివాస్ భవన్‌లో చైతన్యలక్ష్మీ నారాయణుల దివ్య దర్శనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు ప్రదీప, ఈశ్వరి, నందిని, కావ్య అక్కయ్యలు భక్తులు పాల్గొన్నారు.



టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన పెద్ద బాలయ్య

కమలాపురం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న పెట్రోలు బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే.. చాపాడు మండలం బద్రిపల్లె గ్రామానికి చెందిన పెద్ద బాలయ్య స్కూటర్‌పై వెళ్తుండగా పందిళ్లపల్లెలో సమీపంలో ఉన్న పెట్రోలు బంకు వద్ద గ్రావెల్‌తో వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పెద్దబాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన పెద్దబాలయ్యను స్థానికులు 108వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న అయేషా

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. రామసముంద్రం మండలం చెంబకూరుకు చెందిన చాంద్‌బాషా భార్య అయేషాతో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం విషద్రావణం తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న అయేషాను భర్త గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నన్న.. మొక్కజొన్న రైతన్న..



మొక్కజొన్న మీద కప్పిన పట్టపై నిలిచిన వర్షపునీరు

పట్ట కింద ఉన్న మొక్కజొన్న పంట

దువ్వూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పిలువకుండానే పలుకరించే వర్షాల ధాటికి రైతులు కుదేలవుతున్నారు. పంట కోత దశకు రావడంతో కొద్దిరోజులుగా వీటిని కొందరు తొలగించగా మరికొందరు అదే పనుల్లో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో దువ్వూరు మండలంలో సంబంధిత పంట సాగు చేసిన రైతులు డీలా పడుతున్నారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా వీటిని నూర్పిళ్లు చేసుకుని గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం కష్టతరంగా మారింది. అకాల వర్షాలు రైతన్నను పదే పదే వెంటాడుతున్నాయి. అన్ని అవాంతరాలు అధిగమించి పంట చేతికొచ్చే సరికి విపత్తులు వెంటాడుతుండడం రైతులను కంటతడిపెట్టిస్తోంది. మండల పరిధిలో ఇడమడక, దువ్వూరు, పుల్లారెడ్డిపేట, గుడిపాడుతో పాటు ఆయా గ్రామాల పరిధిలోని రోడ్ల మీద తొలగించిన మొక్కజొన్న దిగుబడులను ఆరబెడుతున్నారు. ఉన్నఫళంగా పడుతున్న వర్షాల ధాటికి రైతులు బెంబేలెత్తుతున్నారు. ఈ దుస్థితిని గమనించిన వ్యాపారులు మాత్రం వీరి బాధలను సొమ్ము చేసుకుంటున్నారు. క్వింటా రూ.1800 కొనుగోలు చేస్తున్నారు. రూ.2,500 లభించాల్సిన మొక్కజొన్నను మరీ దారుణమైన రేటుపెట్టి కొనుగోలు చేయడంతో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాడిపండు పడ్డ చందంగా తయారైంది.

రోలర్ స్కేటింగ్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన వర్షిత

పుల్లంపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఎం.వర్షిత రోలర్ స్కేటింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. శనివారం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వర్షిత ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధంచింది. నవంబరులో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వర్షితను ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయికి పెనగలూరు విద్యార్థులు

పెనగలూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని రెయిన్‌బో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఎంపీడీవో విజయరావు కుమార్తెలు సగిలి రావణ, సగిలి సంఘమిత్ర శనివారం కడప మున్సిపల్ పాఠశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యారు. ఒకటో తరగతి చదువుతున్న సగిలి రావణ రింగ్‌రేస్ 1, 2 విభాగాల్లో గోల్డ్‌మెడల్, ఏడో తరగతి చదువుతున్న సగిలి సంఘమిత్ర రజత పతకం సాధించారు. కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో వీరు పాల్గొనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.



రోలర్ స్కేటింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎస్.రావణ, ఎస్.సంఘమిత్ర

గల్లంతైన యువకుడి శవం లభ్యం



నందా మృతదేహాన్ని తీసుకొస్తున్న గ్రామస్థులు

సిద్దవటం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దవటం పెన్నానదిలో శనివారం మధ్యాహ్నం వంతాటిపల్లె గ్రామానికి చెందిన పొట్టిగాండ్ల నందా(35) చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న నందా భార్య పులి సుజాత హుటాహుటిన బంధువులకు సమాచారం ఇవ్వడంతో సిద్దవటం పోలీసులు రంగంలోకి దిగి అగ్నిమాపక రిస్క్యు టీమ్‌ను పిలిపించి గజ ఈతగాళ్లతో పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం మూలపల్లె సమీపంలో శవం లభ్యమైనట్లు ఏఎస్‌ఐ బాలయ్య తెలిపారు. మృతుడి భార్య పులి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పాముకాటుకు ఆవు మృతి

గాలివీడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పాటుకాటుతో ఆవు మృత్యువాత పడిన ఘటన వెలిగల్లు గ్రామ పంచాయతీలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని వెలిగల్లు గ్రామానికి చెందిన మంచూరి వెంకట్రామిరెడ్డికి చెందిన ఆవు ఆదివారం పొలం దగ్గర మేత మేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆవు నోటి నుంచి నురగలు కక్కుతూ మృతి చెందింది. మృత్యువాత పడిన ఆవు విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందని, తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.

ఎమ్మెల్సీని కలిసిన భాషోపాధ్యాయులు

పులివెందుల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి భాషోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆధివారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాంబశివారెడ్డి, భాషోపాధ్యాయులు మాట్లాడుతూ ఇటీవల భాషోపాధ్యాయులు తెలుగు, హిందీ, ఉర్దూలకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల సహాయకులుగా పదోన్నతులు కల్పించిందన్నారు. 2019 నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. కార్యక్రమంలో భాషోపాధ్యాయులు రోశిరెడ్డి, లక్ష్మీనరసయ్య, స్వతంత్రబాబు తదితరులు పాల్గొన్నారు. కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చిన మహిళా భాషోపాధ్యాయులకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి సత్కరించారు.

కుమార్తె వివాహానికి సీఎంను ఆహ్వానించిన వికాస్ హరికృష్ణ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ తన కుమార్తె లక్ష్మీ లహరి వివాహానికి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానించారు. ఈ వివాహం ఈనెల 31వ తేదీ ఉదయం ప్రొద్దుటూరులోని రాయల్ కౌంటీలో జరగనుందని వికాస్ హరికృష్ణ తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో వికాస్ హరికృష్ణ, కుటుంబసభ్యులు

జాతీయస్థాయి క్రీడాకారిణికి చేయూత

వేంపల్లె, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కాత్యాయని అనే విద్యార్థిని అండర్-19 రాష్ట్రస్థాయి గోల్‌షాట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ విద్యార్థినికి నందిపల్లె సర్పంచు సులోచన కుమారుడు ఎన్ఆర్ఐ శ్రీకాంత్‌రెడ్డి చేయూత నందించారు. ఆదివారం రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించారు. జాతీయస్థాయిలో అండర్-19 గోల్‌షాట్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 29 నుంచి నవంబరు 1 వరకు బీహార్ రాష్ట్రం బెగుసరాయ్ పట్టణంలో జరిగే పోటీల్లో ఈ విద్యార్థిని పాల్గొననుంది.



ఉద్యోగుల పక్షపాతి సీఎం చంద్రబాబు

కడప,కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి కానుకగా నవంబరు నెల నుంచి ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేయడం, డిమాండ్లను త్వరలో పరిష్కరిస్తానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందన హర్షణీయమని ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు, రాష్ట్ర పాధ్యక్షుడు వైవీ ప్రసాద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నిత్య పూజయ్య, సంఘ నేతలు,సభ్యులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం నగరం లోని ఏపీ ఎన్జీవో సంఘ కార్యాలయంలో సీఎం చంద్రబాబు ఉద్యోగులకు డీఏ, ఇతర డిమాండ్లపై స్పందించిన తీరుపై సంఘనేతలు, కార్యవర్గం థ్యాంక్యూ సీఎం సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమం లోజేఏసీ, ఎన్జీవో సంఘ నేతలు తిమ్మారెడ్డి, పద్మనాభరావు, వీరారెడ్డి పాల్గొన్నారు.



కడప..ఏపీ ఎన్జీవో ఉద్యోగ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

ఉద్యోగులతో చర్చలు సంతోషకరం

పులివెందుల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఐదేళ్ల తర్వాత ఉద్యోగులతో గౌరవప్రదమైన, హుందాతన చర్చలు జరగడం సంతోషకరమని ఏపీ ఎన్జీఓ అసోసి యేషన్ పులివెందుల తాలూకా అధ్యక్షుడు జి.జగన్నాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దీపావళి పండు గకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించడం, ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి స్పందన హర్షణీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ పులివెందుల తాలూకా కార్యదర్శి జి.ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు సిద్దయ్య పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడే సందడి

కడప కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కావడంతో ప్రేక్షకులు ఎక్కువ సంఖ్యలో చేరుకుని కుటుంబాలతో ఆనందహేళిలో భాగస్వాములయ్యారు. అక్కడి సాంస్కృతిక కళావేదికపై మిస్బా వారి సహకారంతో కడప నగరానికి చెందిన అఖిల్ మాస్టర్ బృందంచే చిన్నారులు వివిధ జానపద, శాస్త్రీయ, సినీ పాటలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

విలువలు కలిగిన వ్యక్తుల కలయికే మానవత సంస్థ



సమీక్ష సమావేశంలో మానవత సంస్థ సభ్యులు

కడపసెవెన్ రోడ్స్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ కడప పట్టణంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవతా సంస్థ నెలవారి సమావేశం ప్రొఫెసర్ జి.సాంబివారెడ్డి అధ్యక్షతన జరిగింది. విలువలు కలిగిన వ్యక్తుల కలయికే మానవతా సంస్థ అని, శాంతి సమాజ నిర్మాణమే మానతా ధ్యేయమని సాంబశివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ మావనతాసంస్థ చేసే కార్యక్రమాలు దైవికమైనవని, పవిత్రమైనవని కొనియాడారు. కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ డాక్టర్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ మానవతా సంస్థ సమ సమాజ స్థాపన ధ్యేయంగా కులమతాలకు అతీతంగా సాటి మానవునికి తోడ్పాటునందిస్తుందన్నారు. అనంతరం కీర్తిశేషులు జలతోటి భాస్కర్ తల్లి సుబ్బమ్మ, రిటైర్డ్ హైస్కూల్ టీచర్ మాసాపేట, వారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మాధవి రూ.70వేల చెక్కును బాడీ ఫ్రీజర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్ట సుబ్రహ్మణ్యం,పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు, కళాశాల కరస్పాండెంట్ భైరెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య,కన్వీనర్ నర్రెడ్డి మాధవి తదితరులు పాల్గొన్నారు.

గోటూరు - శివాలపల్లె రోడ్డు నిర్మాణం పూర్తయ్యేనా..?

వల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గోటూరు శివాలపల్లె రోడ్డు నిర్మాణ పనులు జరిపించాలని ప్రజలు ఆవేదనవ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం ఈ రోడ్డుపైన తారురోడ్డు వేశారని ప్రస్తుతం రోడ్డంతా గుంతలమయంగా ఉంది. ద్విచక్ర వాహనదారులైతే రాత్రి సమయాల్లో సరిగా కనబడక కింద పడి గాయాల వుతున్నారు. దీంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గోటూరు గ్రామస్థులు కొందరు భూముల్లోకి వెళ్లాలంటే ఈ రహదారి గుండానే వెళ్లాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో శివాలపల్లె సమీపంలో నుంచి గోటూరుకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. చెన్నూరు మండలానికి వెళ్లాలంటే చాలా దగ్గరవుతుందని అన్నారు. అలాగే పుష్పగిరికి వెళ్లాలన్నా ఈ రహదారి గుండానే వెళ్లాల్సి వస్తుందని, కార్తీకమాసం రాబోతుందని రోడ్డు బాగు చేస్తే భక్తులు సులువుగా వెళ్లవచ్చని అంటున్నారు.


గుంతలమయంగా ఉన్న గోటూరు - శివాలపల్లె రోడ్డు

సామాజిక సేవ అంటే డబ్బులు ఇవ్వడమే కాదు ధైర్యమూ కల్పించాలి

వేంపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ అంటే కేవలం డబ్బు ఇవ్వడమే కాదని ప్రోత్సాహం, ధైర్యం, మానసిక బలం వారిలో కల్పించాలని మానవతా మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ యోగీశ్వరబాబు అన్నారు. ఆదివారం వేంపల్లెకు చెందిన ఓ బాలిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్యఖర్చులకు మానవత చైర్మన్ చక్రపాణిరెడ్డితో కలిసి యోగీశ్వరబాబు ఆ బాలికకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, చలపతి, గురుప్రసాద్, గంగయ్య పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న మానవత ప్రతినిధులు









మెగా ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

వల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): లాస్య ఆర్థోస్కిన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన వల్లూరులోని గణేశ్‌పురం వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో చర్మవ్యాధులు, ఎముకలు,నరాలు వెన్నెపూసకు సంబంధించి చికిత్స చేయించుకున్నారు. దాదాపు 120 మందికిపైగా రోగులు ప్రాథమిక చికిత్స చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. వీరికి ఉచితంగామందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంబాబత్తిన జ్యోతి, డాక్టర్ గీతకుమార్, డాక్టర్ అంబాబత్తిన శశిధర్ పాల్గొన్నారు.





In the Court of the Hon'ble Principal Senior Civil Judge, Kadapa.
E.A. No. 184/2024 E.A. No. 353/2013
E.A. No. 154/2011 O.S. No. 43/1999

1) Rayachoty Lakshumma W/o Late Subbanna, Hindu Aged 70 years, Son's Protection, Residing at Alankhanpalli, Kadapa Mandal and Dist. having died added her LRs. 2) Rayachoty Subbarayudu S/o Late Subbanna, Hindu, Aged 52 years, Residing at Alankhanpalli, Kadapa Mandal & Dist.,

- Petitioner/proposed 2nd Claimant

V/s

1)Chenchula Sankaraiah S/o Kondappa, Hindu, Aged 47 years, Residing at Pulivendula Town and Mandal, Kadapa Dist. 2) Arisa Subbamma W/o late A. Naraiah, Hindu, Aged 82 Years, Residing at Nagarajupeta, Kadapa City. 3) Arisa Subbarayudu S/o Naraiah, Hindu, Aged 69 Years, Senior Assistant, Z.P.P. Office, Kadapa Town, Now extension officer (R.D.), M.P.D.O. Office, Chinnamandem Mandal, Kadapa Dist. 4) Arisa Sreeramulu S/o Naraiah, Hindu, Aged 62 Years, Senior Assistant, Animal Husbandry Department, Srihari Rao Street, Nagarajupeta, Kadapa City.

- Respondents/Respondents 2 to 5

నోటీసు

పై పిటిషన్‌లో 2వ పిటిషనరు, మరణించిన మొదటి పిటిషనరుకు వారసుడిగా తనను పేర్కొంటూ,పై తెలిపిన న్యాయస్థానం 19-5-2024న జారీ చేసిన అటేచ్మెంట్ ఆర్డర్‌ను సెట్ అసైడ్ చేయమని పిటిషన్ వేయడం జరిగినది. సదరు పై పిటిషన్‌లో మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల 30-10-2025 తేదీన ఉదయం 10.30 గంటలకు, సదరు పిటిషన్‌లో 2 నుండి 5వ రెస్పాండెంట్లు అయిన మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

ఇట్లు, వి. రామమోహన్, అడ్వకేట్, కడప.

In the Court of the Hon'ble Principal Senior Civil Judge, Kadapa.
E.A. No. 186/2024 E.A. No. 353/2013
E.A. No. 154/2011 O.S. No. 43/1999

1) Rayachoty Lakshumma W/o Late Subbanna, Hindu Aged 70 years, Son's Protection, Residing at Alankhanpalli, Kadapa Mandal and Dist. having died added her LRs. 2) Rayachoty Subbarayudu S/o Late Subbanna, Hindu, Aged 52 years, Residing at Alankhanpalli, Kadapa Mandal &Dist.,

- Petitioner/proposed 2nd Claimant

V/s

1)Chenchula Sankaraiah S/o Kondappa, Hindu, Aged 47 years, Residing at Pulivendula Town and Mandal, Kadapa Dist. 2) Arisa Subbamma W/o late A. Naraiah, Hindu, Aged 82 Years, Residing at Nagarajupeta, Kadapa City. 3) Arisa Subbarayudu S/o Naraiah, Hindu, Aged 69 Years, Senior Assistant, Z.P.P. Office, Kadapa Town, Now extension officer (R.D.), M.P.D.O. Office, Chinnamandem Mandal, Kadapa Dist. 4) Arisa Sreeramulu S/o Naraiah, Hindu, Aged 62 Years, Senior Assistant, Animal Husbandry Department, Srihari Rao Street, Nagarajupeta, Kadapa City.

- Respondents/Respondents 2 to 5

నోటీసు

పై పిటిషన్‌లో 2వ పిటిషనరు, మరణించిన మొదటి పిటిషనరుకు వారసుడిగా తనను పేర్కొంటూ, సదరు క్లయిమ్ పిటిషన్‌లో తనను, 2వ పిటిషనరుగా చేర్చమని పిటిషన్ దాఖలు చేయడం జరిగినది. సదరు పిటిషన్‌లో మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల 30-10-2025 తేదీన ఉదయం 10.30 గంటలకు సదరు పిటిషన్‌లో 2 నుండి 5వ రెస్పాండెంట్లు అయిన మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

ఇట్లు, వి. రామమోహన్, అడ్వకేట్, కడప.

రాష్ట్ర పురోభివృద్ధి సాధకుడు చంద్రబాబు

కడప మారుతీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో తిరోగమన దిశలో చితికిలపడిన రాష్ట్రాన్ని ప్రస్తుత కూటమి పాలనలో తిరిగి సరైన గాడిలో ఉంచి అభివృద్ధి వైపు పరుగులు పెట్టేలా నారాచంద్రబాబు పాలన సాగిస్తున్నారని టీడీపీ నగర అగాడి మైనార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఆర్‌కే మహబుల్లాఖాన్ పేర్కొన్నారు. ఆదివారం అగాడి (సాయిపేట)లో టీడీపీ మైనార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు షామహ్మద్, వాహిద్, సలీం, జయచంద్ర, జనార్దనరెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.

హామీలు బూటకమేనా?

పీఎస్టీయూ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ బూటకమని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి విమర్శించారు. ఆదివారం ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.చిన్నరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







పాఠకులకు దీపావళి శుభాకాంక్షలు





గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.207 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరా ల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వ దంలుతున్నావన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

అన్నదానానికి వితరణ

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, పారిశ్రామికవేత్త కాణాల మల్లిఖార్జునరెడ్డి అయ్యప్పదీక్ష చేపట్టబోయే స్వాముల అన్నదానానికి రూ.20వేలు వితరణగా అందించారు. కొత్తూరుకు చెందిన గురుస్వామి ఆకుల శివకుమారస్వామి తన వద్దకు వచ్చి త్వరలో అయ్యప్పదీక్ష చేపట్టబోయే స్వాముల కు తమ వంతు సాయం అందించాలని కోరగా వెంటనే స్పందించిన మల్లిఖార్జునరెడ్డి రూ.20వేలకు ఆహార వస్తువులు అందించినట్లు వివరించారు. గత రెండు నెలల క్రితం ఈశ్వరీదేవి మాత గుడి పునర్నిర్మాణానికి తన వంతుగా రూ.10లక్షలు అందించామని తెలిపారు.

దీక్ష వస్త్రాలు, పూజాసామగ్రి


బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో చేపట్టబోయే అయ్యప్ప దీక్షాపరులకు ఉచితంగా దీక్షా వస్త్రాలు, పూజా సామగ్రి అందించడం జరుగుతుందని శ్రీకృష్ణదేవరాయ బలిజ తెలగ కాపు నిత్యాన్నదాన సంఘం అధ్యక్షుడు ధర్మిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 22న బలిజ అన్నదాన సత్రంలో దీక్ష చేపట్టే స్వాములకు వాటిని అందిస్తామన్నారు.

















విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రెడ్ల కల్యాణ మండపంలో రెడ్డి సేవా సంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా రెడ్డి సామాజిక వర్గం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. 116 మంది విద్యార్థులకు రూ.16.5 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సి.నారాయణరెడ్డి, రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, గౌరవాధ్యక్షుడు డాక్టర్ వై.వి.రామమునిరెడ్డి, రెడ్డి సేవా సంఘం ఉపాధ్యక్షులు రామిరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కోకటం బాలవీరారెడ్డి, కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటిపై గ్రావెల్ తోలకం

దువ్వూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురంలో మురుగునీటితో అధ్వాన్నంగా ఉన్న వీధిలో గ్రావెల్‌తో నింపారు. నీరు నిలువ కుండా గ్రామ పంచాయతీ శ్రద్ధ తీసుకుంది. ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో 'ఆ దారి రొచ్చు రొచ్చు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. గ్రామ పరిసరాలు, వీధుల్లో అడుగు పెట్టాలంటే ప్రజలు ఇబ్బందులు పడడంతోపాటు రోగాల బారీన పడుతున్న విషయాన్ని కథనంలో వెల్లడించడం జరిగింది. ఈ నేపథ్యంలో సదరు వీధిలో మురుగు నీరు నిలువకుండా గ్రావెల్ తోలి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు.

అసాంఘికాలకు అడ్డుకట్ట

జమ్మలమడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచనలతో జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో అసాంఘికాల అడ్డుకట్టకు డ్రోన్ కెమెరాలు వినియోగించినట్లు అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని గూడుమస్తాన్‌వలి వెనుకభాగంలో పెన్నా పరిసర ప్రాంతాలు గూడెం చెరువు గ్రామ పొలిమేరలో గండికోట పర్యాటక ప్రాంతంలో డ్రోన్ కెమెరాలు ఆదివారం వినియోగించామని తెలిపారు.

సీఎం స్పందన హర్షణీయం

ప్రొద్దుటూరు , అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) :దీపావళి కానుకగా నవంబర్ నుంచి ఒక నెల డీఏను విడుదల చేయడం పై ఎన్‌జీవో తాలుకా సంఘం అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి హర్షం వక్తం చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో రఘురామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్సు విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం హర్షణీయమన్నారు. సమావేశంలో ఎన్జీవో కార్యదర్శి రామసుబ్బయ్య, సహఅధ్యక్షుడు సదాశివయ్య, ఉపాధ్యక్షులు శివరామానుజ జాయింట్ సెక్రటరీ మహేశ్వరయ్య నాగార్జున ఉన్నారు.

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

బద్వేలులో: దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డీఏను విడుదల చేయడం 60 రోజులలో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఏపీ ఎన్‌జీవో, ఏపీ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఏపీ ఎన్‌జీవోఅసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహారెడ్డి, కార్యదర్శి పి.శివరామిరెడ్డిలు మాట్లాడుతూ ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయించడం, బకాయిలు రద్దు చేయడం సమస్యలన్ని పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు.


బహిరంగ మద్యం తాగడంపై డ్రోన్ ఆపరేషన్

ప్రొద్దుటూరు , అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. ఆదివారం ఎస్పీ విశ్వనాథ్, డీఎస్పీ భావన ఆదేశాలతో రూరల్ సీఐ నాగభూషణం 19 మందిని అదుపులోకి తీసుకొని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

















అన్నన్న.. మొక్కజొన్న రైతన్న..


మొక్కజొన్న మీద కప్పిన పట్టపై నిలిచిన వర్షపునీరు

దువ్వూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పిలువకుండానే పలుకరించే వర్షాల ధాటికి రైతులు కుదేలవుతున్నారు. పంట కోత దశకు రావడంతో కొద్దిరోజులుగా వీటిని కొందరు తొలగించగా మరికొందరు అదే పనుల్లో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో దువ్వూరు మండలంలో సంబంధిత పంట సాగు చేసిన రైతులు డీలా పడుతున్నారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా వీటిని నూర్పిళ్లు చేసుకుని గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం కష్టతరంగా మారింది. అకాల వర్షాలు రైతన్నను పదే పదే వెంటాడుతున్నాయి. అన్ని అవాంతరాలు అధిగమించి పంట చేతికొచ్చే సరికి విపత్తులు వెంటాడుతుండడం రైతులను కంట తడిపెట్టిస్తోంది. మండల పరిధిలో ఇడమడక, దువ్వూరు, పుల్లారెడ్డిపేట, గుడిపాడుతో పాటు ఆయా గ్రామాల పరిధిలోని రోడ్ల మీద తొలగించిన మొక్కజొన్న దిగుబడులను ఆరబెడుతున్నారు. ఉన్నఫళంగా పడుతున్న వర్షాల ధాటికి రైతులు బెంబేలెత్తుతున్నారు. ఈ దుస్థితిని గమనించిన వ్యాపారులు మాత్రం వీరి బాధలను సొమ్ము చేసుకుంటున్నారు. క్వింటా రూ.1800 కొనుగోలు చేస్తున్నారు. రూ.2,500 లభించాల్సిన మొక్కజొన్నను మరీ దారుణమైన రేటుపెట్టి కొనుగోలు చేయడంతో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది.



వివాహానికి సీఎంను ఆహ్వానించిన వికాస్ హరికృష్ణ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ తన కుమార్తె లక్ష్మీ లహరి వివాహానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానించారు. ఈ వివాహం ఈనెల 31వ తేదీ ఉదయం ప్రొద్దుటూరులోని రాయల్ కౌంటీలో జరగనుందని వికాస్ హరికృష్ణ తెలిపారు.


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో వికాస్ హరికృష్ణ, కుటుంబసభ్యులు

ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకనే గుండె జబ్బులు

ప్రొద్దుటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆహారపు అలవాట్లతో పాటు వ్యాయామం లేకపోవడంతోనే గుండె జబ్బులు ఎక్కువగా వస్తాయని ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నెహ్రూ రోడ్డులో గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 44 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ హరిత 33 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. తగు సూచనలను సలహాలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


గుండె వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

ఖాజీపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలోని శ్మశాన వాటికలను దశలవారీగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తానని మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఖాజీపేట బీసీ కాలనీలోని శ్మశాన వాటికకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధే నా ధ్యేయమని, ప్రజల సౌకర్యార్థం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రభాస్కర్‌రెడ్డి, రవి, సుబ్బయ్య, వెంకటరామిరెడ్డి, కదిరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి పండుగ

ప్రొద్దుటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మట్టి మసీదు వీధిలో ఉన్న హజరత్ దస్తగిరిస్వామి పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు నూరీ ఆధ్వర్యంలో ఫకీర్ మేళ తాళాలతో మట్టి మసీదు వీధిలో ఊరేగింపు జరిగింది. జెండా చెట్టుకు పూలచాదర్ కప్పి చదివింపులు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ జబివుల్లా, టీడీపీ నాయకుడు మెట్టుపల్లి రామచంద్రారెడ్డి, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, కమాల్‌బాషా, జిలాన్ బాషా, వెల్లాల మహ్మద్‌గౌస్, టీడీపీ నాయకులు పోసా భాస్కర్, కుతుబుద్దీన్, ఖాజామైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


గంధం కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, నూరి

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

మైదుకూరు అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మైదుకూరు బాలశివ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం చేశారు.కడప 30 బెటాలియన్ ఎన్‌సీసీ అదికారులు యూనిట్‌ను ప్రారంభించారు.



ఇంటింటా దీపావళి సంబరాలు

ప్రొద్దుటూరు/టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని టపాసుల అంగళ్లు సందడి.. సందడిగా మారాయి. ప్రొద్దుటూరు పట్టణంలోని మోడంపల్లె బైపాస్ రోడ్డులో టపాసుల విక్రయాల కోసం 40 దుకాణాలు ఏర్పాటు చేయడంతో. ఉదయం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో టపాసుల కొనుగోలు చేయడానికి తరలి వస్తుండడంతో ఆ ప్రాంతం సందడిగా మారంది. పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాల ప్రజలు కూడా ఇక్కడే టపాసులు కొనుగోలు చేస్తున్నారు.. దుకాణాలవద్ద అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టుటౌన్ సీఐ సదాశివయ్య దుకాణాదారులకు సూచించారు.


టపాసుల దుకాణాల వద్ద సూచనలు ఇస్తున్న సీఐ సదాశివయ్య

అగ్నిమాపక అధికారుల భద్రతా చర్యలు

ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణా లకు అగ్నిమాపక అధికారులు ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేసి భద్రతా చర్యలు తీసు కున్నారు. ఆదివారం ఫైర్ ఇంజన్‌తో పాటు పది మంది అగ్నిమాపక సిబ్బందిని అక్కడ భద్రత కోసం నియమించారు. ప్రమాదం జరిగాక ఫైర్ ఇంజన్ అక్కడి రావడం కంటే ముందుగానే అక్కడ ఫైర్ ఇంజన్‌తో పాటు సిబ్బంది సిద్ధంగా ఉండటం వలన ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి తెలిపారు.

దువ్వూరులో బస్‌షెల్టర్ ఏర్పాటు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా

దువ్వూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో బస్టాండు ఏర్పాటు కావాలని 25 ఏళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారని బస్‌షెల్టర్ ఏర్పాటుతో వారి కల నెరవేరిందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ వెల్లడించారు. దువ్వూరులో నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అన్ని సౌకర్యాలతో షెల్టర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో దీనిని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు అభివృద్ధి కనిపించడం లేదా?

మైదుకూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యేగా తాను చేసిన, చేపట్టిన అభివృద్ధి పనులు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి కనపడడంలేదా? అని పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రశ్నించారు. ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని ఉద్ఘాటించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ రమణారెడ్డి, నీటి సంఘాల చైర్మన్ కోనేటి హరినాథ్, దువ్వూరు నీటి సంఘం అధ్యక్షుడు పోలు రామమోహన్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు పాపినేని రాంబాబు, మండల నాయకులు పెంచికలపాటి వెంకటసుబ్బయ్య, మారుగాని సురేష్‌యాదవ్, ఆశీర్వాదం, ఈపూరి సత్యం, తాహర్ హుస్సేన్, పలు గ్రామాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 8 కోట్లతో 100 అభివృద్ధి పనులకు శ్రీకారం

మైదుకూరు అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మున్సి పాలిటీలో రూ.8కోట్లతో 100 అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని విజ యనగర్ కాలనీలో సిమెంటు రోడ్డుకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి కోసం తనను గెలిపించారని, వారి కి అండగా ఉంటానన్నారు. సమస్యల పరిష్కారంలో అదికారులు, ఇన్‌చార్జిలు పని చేయకుంటే నియోజకవర్గ ప్రజలు నేరుగా తన సెల్ నెంబర్ 9849041183కు పోన్ చేయవచ్చన్నారు. రూ.220 కోట్లతో మైదుకూరు అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అందులో 99 కోట్ల తో ప్రతి ఇంటికి మంచినీరందిస్తామన్నారు.

రజాసాహెబ్‌పేటలో చోరీ

పోరుమామిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాసాహెబ్‌పేటలో శనివారం రాత్రి నాలుగు గృహాలను లూటీ చేశా ు. ఆ గ్రామంలో కొంత మంది పీజీలు నిర్వహించుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో వారి ఇళ్లకు తాళాలు వేసి ఉన్నారు. అయితే కొంత మంది దుండగులు శనివారం రాత్రి ఆ గృహాల్లో తాళాలు పగల గొట్టి బీరువాలు ధ్వంసం చేసి వస్తువులను చెల్లాచెదరు చేశారు. గ్రామంలోని కొందరు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్‌ఐ కొండారెడ్డి సిబ్బందితో వెళ్లి ఆ గ్రామంలో చోరీకి గురైన గృహాలను పరిశీలించారు. క్లూస్‌టీం కూడా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గృహాలకు సంబంధించిన వారు ఇతర ప్రాంతాలకు వెళ్లారని, ఆదివారం ఫిర్యాదు రావడంతో పరిశీలించామన్నారు.